# క్రై కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 89 ఆదివారం 28-12-2025 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రై కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు

- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## నిరుపయోగంగా గిరిజన బాలుర (ఎ) కళాశాల వసతిగృహం.





క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, లక్ష్మీపురం కాలనీ. డిసెంబర్ 27 ( గురునాథం జిల్లా బ్యూరో) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మున్సిపల్ పరిధిలోని లక్ష్మీపురం కాలనీలో నిర్మించి ఉన్న గిరిజన బాలుర (ఏ) కళాశాల వసతి గృహ భవనం నిరుపయోగంగా ఉండి ప్రారంభానికి నోచుకోకుండా ఉంది. కోట్ల రూపాయల ప్రజా ధనంతో నిర్మించి ప్రభుత్వాలు ఇలా నిరుపయోగంగా ఉండటంతో దీని ఉపయోగం ఏముంది? గిరిజన సంక్షేమ శాఖ కళాశాల ఉన్న చోటనే భవనం నిర్మిస్తే చాలా బాగుండేది. ఇలా నిరుపయోగంగా ఉండే బదులు లక్ష్మీపురం కాలనీలో లేని అంగన్వాడి భవనం, ప్రైమరీ హెల్త్ సెంటర్ మరియు శాఖ గ్రంధాలయంలకు కేటాయించిన చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కనుక దీని విషయమై ప్రభుత్వం పునరాలోచన చేసి అమల్లోకి తేవాలని ప్రభుత్వానికి సంబంధిత శాఖకు విజ్ఞప్తి. సయ్యద్ బషీరుద్దీన్ సామాజిక ఉద్యమకారుడు కోదాడ లక్ష్మీపురం కాలనీ.

## రాజేష్ కుటుంబానికి మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అండగా ఉంటుంది.



చిలుకూరు ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలి. మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు డపుకు మల్లయ్య. క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, డిసెంబర్ 27( గురునాథం జిల్లా బ్యూరో ) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ పట్టణానికి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు మాదిగ లాయర్స్ ఫెడరేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు డపుకు మల్లయ్య అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం కోదాడ పట్టణంలోని రాజేష్ నివాసానికి సూర్యాపేట తుంగతుర్తి కోదాడ నుంచి మాదిగ న్యాయవాదులు వెళ్లి తల్లి లలితమ్మను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రూరల్ సీఐ ప్రతాప లింగం పై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయడం జరిగిందని, అదేవిధంగా చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి పై కేసు నమోదు చేసినప్పటికీ నేటి వరకు సస్పెండ్ చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే సురేష్ రెడ్డిని సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు అన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలుపుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి అరెస్టు అధికారికంగా ప్రకటించేంతవరకు నిరసన దీక్షలు, ధర్నాలు రాస్తారోకాలు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి , ఆధ్వర్యంలో కొనసాగుతాయని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, కోదాడ అధ్యక్షులు దిరిశనపు దావీద్, న్యాయవాదులు మందుల శ్రీనివాస్, మీసాల శ్రీనివాస్, నవీన్, అంజిబాబు, వంశీ, కర్ల రాజేష్ తమ్ముడు కర్ల కమల్, కుడుముల వెంకటయ్య, యేసుపొంగు కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## కాపుగల్లు పీహెచ్ సి డాక్టర్ గా డాక్టర్ యశ్వంత్ కుమార్.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, కాపుగల్లు. డిసెంబర్ 27 ( గురునాథం జిల్లా బ్యూరో ) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ గా డాక్టర్ యశ్వంత్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టినారు. గతంలో మోతేలో విధులు నిర్వహించి కాపుగల్లు ప్రజా వైద్యశాలకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాపుగల్లు ప్రజా వైద్యశాల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజల ఆరోగ్యం కోసం నేను మా స్టాప్ సహకారంతో నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నది. కావున ప్రజలు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో విధులు నిర్వహించిన డాక్టర్ ధర్మతేజ ఆర్బిఎస్కే కు వెళ్లడం జరిగింది.

## నిర్విరామ సేవలు అందిస్తూనిరు పేదలకు బాసటగా నిలుస్తున్న....



సుంకిరెడ్డి ఉచిత కంటి వైద్య శిభిరం.

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి రంగారెడ్డి జిల్లా మాడుగుల: - నేటితో ముగిసిన ఉచిత కంటి పరీక్షలు,29వ తారీఖు సోమవారం వరకు కొనసాగనున్న కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు. టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శంకర నేత్రాలయ చెన్నై వారిచే నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో“మూడు రోజులుగా 81 మంది కంటి శుక్లాల పేషెంట్లకు విజయవంతంగా ఆపరేషన్లు“ పూర్తి.ఏడు రోజులుగా.5,200 మంది వరకు హాజరవ్వగా, 3,300 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహణ. 2,200మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ,172 మంది పేషెంట్లు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక.ఈ సందర్భంగా...ఐక్యత ఫౌండేషన్ మాడుగుల ఇంచార్జ్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ..గత ఏడు రోజులుగా నిర్విరామంగా సేవలు అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరంలోనేటితో కంటి పరీక్షల ప్రక్రియ ముగిసిందని,మూడు రోజులుగా నడుస్తున్న కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ ఈనెల 29వ తారీఖు సోమవారం వరకు కొనసాగుతుందని తెలుపుతూ.ఏడవ రోజు శిబిరానికి.సుమారుగా 1100 మందికి వరకు హాజరవ్వగా, 690 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామని,400 పైగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామని,30 మందికి వరకు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపికలి అయ్యారని తెలియజేశారు,ఇంత పెద్ద ఎత్తున మాడుగుల మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ సేవలు వినియోగించుకున్న మాడుగుల ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, నియోజకవర్గంలో నిస్వార్థ సేవలతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,ఐక్యత ఆరోగ్య భరోసా కార్యక్రమంతో మా ఫౌండేషన్ ప్రతిపేద కుటుంబానికి అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో...ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు,నరేందర్ గౌడ్,రఘు,లింగం, యాదయ్య,శ్రీపతి,శేఖర్, నాగిళ్ళ శివ,ఎరుకలి శివ,శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీని నెరవేర్చిన నారాయణపురం సర్పంచ్



క్రైమ్ కౌంటర్ న్యూస్ నారాయణపురం డిసెంబర్ 27 చిలుకూరు మండల రిపోర్టర్ సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా ఏర్పడిన సర్పంచ్ మండవ జయమ్మ/వెంకటేశ్వర్లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. నారాయణపురం నుండి సీతారాంపురం వరకు రెండు కిలోమీటర్ల రహదారికి ఇరుపక్కల ఉన్న కంప చెట్లు పెరగడంతో రాకపోవలకు వాహనదారులకు ఇబ్బందులు కలుగుతుందని రోడ్డుకి ఇరుపక్కల ఉన్న కంపచెట్లను రోడ్డుపై ఉన్న గుంటలను జెసిపి తో చదును చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఏపీకే ఫైల్స్ అత్యంత ప్రమాదం.




- ఏపీకే ఫైల్స్ అనుసరించి మొబైల్ యాప్స్ డౌన్లోడ్, ఇన్స్టాల్ చేయొద్దు.
- ఇవి సైబర్ మోసగాళ్ళ సృష్టి. మొబైల్ హ్యాక్ చేసి ఆర్థిక నష్టం కలిగిస్తారు.
- పోలీస్ చలానా, ఆర్టిఏ చాలానా, ప్రభుత్వ పథకాల పేరుతో నకిలీ ఫైల్స్.
- మొబైల్స్ కు వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్లోడ్ చేయొద్దు.
- క. నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, డిసెంబర్ 27 ( గురునాథం జిల్లా బ్యూరో)మొబైల్ ఫోన్స్ కు వాట్సప్ గ్రూపుల ద్వారా, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ఏపీకే ఫైల్స్ సందేశం పంపించి వాటిని అనుసరించేలా చేసి మొబైల్ హ్యాక్ చేసి ఆర్థిక నష్టాన్ని కలిగిస్తారు. సైబర్ మోసగాళ్లు, ఏపీకె ఫైల్స్ అనేవి సైబర్ మోసగాళ్ల ఎత్తుగడ మాత్రమే, ఏపీకే ఫైల్స్ అత్యంత ప్రమాదకరం. వీటిని అనుసరిస్తూ మొబైల్ యాప్ లు డౌన్లోడ్ చేసి ఇన్స్టాల్ చేస్తే సైబర్ మోసగాళ్ళు మొబైల్ డేటా దొంగిలించి హ్యాక్ చేసి ఆర్థిక నష్టం కలిగిస్తారని జిల్లా.ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్, ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్స్ కు సందేశం రూపంలో వచ్చే ఏపీకె ఫైల్స్ ను ఎవరు డౌన్లోడ్ చేయవద్దు అని, ఈ సందర్భంగా కోరారు. ఆర్టిఏ చలానా, టిఎస్ పోలీస్ చలానా ప్రభుత్వ పథకాలు అంటూ వాట్సప్ గ్రూపుల ద్వారా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేసి వాటిని మొబైల్ ఫోన్స్ లో డౌన్లోడ్ చేసుకునేలా ప్రేరేపిస్తారు. ఏపీకే ఫైల్స్ ను మొబైల్ లో డౌన్లోడ్ చేస్తే మొబైల్ పూర్తిగా సైబర్ మోసగాళ్ల ఆధీనంలోకి వెళ్తుంది. వారు మీ మొబైల్ ను వినియోగించి మీ బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బును దొంగలిస్తారు. ఇలాంటి ఏపీకే ఫైల్స్ ను ఎవరు నమ్మవద్దు అని సూచించారు. ఈ ఏపీకే ఫైల్స్ అనేవి సైబర్ మోసగాళ్ల సృష్టి అని తెలిపారు. వీటిని డౌన్లోడ్ చేసి అనుసరిస్తే ఫోన్ హ్యాక్ అయినట్లే. ఇటీవల సైబర్ మోసగాళ్లు కొత్త పన్నాగంతో ముందుకు వస్తున్నారు. పోలీస్ చాలనా, ఆర్టిఏ చాలనా, ప్రభుత్వ పథకాలు పేరుతో నకిలీ ఏపీకే ఫైల్ లింకులు పంపుతూ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ లింక్ను ఓపెన్ చేస్తే వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఫోన్ డేటా దొంగిలించే ప్రమాదం ఉంది. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి లింకులు క్లిక్ చేయకూడదు. అధికారిక సమాచారం కోసం మాత్రమే ప్రభుత్వ వెబ్సైట్లు, అధికారిక యాప్లు ఉపయోగించాలి. అనుమానాస్పద లింకులు, సందేశాలు అందిన వెంటనే వాటిని పోలీస్ శాఖకు తెలియజేయాలని, జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. “సైబర్ మోసగాళ్ల పన్నాగాలకు లోనుకాకండి. మీ భద్రత కోసం అప్రమత్తంగా ఉండండి అన్నారు.

## నూతన సర్పంచ్ ల ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమం.





క్రైం కౌంటర్ న్యూస్ మోతే, కరక్కాయలగూడెం, సర్వారం. డిసెంబర్ 27 ( గురునాథం జిల్లా బ్యూరో ) 27-12-2025 శనివారం సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం మోతే మండలం కర్కాయలగుడెం మరియు సర్వారం గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మరియు ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి. అనంతరం ఎన్నికైన వారికీ వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ గా




సీనియర్ పాత్రికేయులు- కందుకూరి యాదగిరి నియామకం

క్రైమ్ కౌంటర్ సూర్యాపేట జిల్లా డిసెంబర్ 28

తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ రాష్ట్ర కో.కన్వీనర్ గా సూర్యాపేట జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయులు కందుకూరి యాదగిరి నియామకం అయ్యారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో యాదగిరి కి ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా టియూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, టిజేఎస్ఎస్ అధ్యక్షులు ఆనించిన్ని వెంకటేశ్వర్లు, ఏఐడబ్ల్యూజేఏ అధ్యక్షులు కోటేశ్వరరావు లు మాట్లాడుతూ కందుకూరి యాదగిరి గత నాలుగు సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టుల అభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయం అని తెలిపారు. ఆయన అసోసియేషన్ ద్వారా చేపట్టిన అన్ని కార్యక్రమాలను చూస్తున్నామని తెలిపారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు.ఈ సందర్భంగా కందుకూరి యాదగిరి మాట్లాడుతూ జేఏసీ ఎప్పుడు ఎలాంటి పిలుపునిచ్చిన తాము అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటామని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పెద్దలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు.

## శవాలను పీకు తింటున్న "భీమా మాఫియా" రాబందులు.



మృతురాలి పాలసీలో నామిని మార్పు -రూ. 2.5 లక్షల గల్లంతు.

- సంచలనం రేపిన ఘరానా మోసం.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, లక్ష్మీపురం కాలనీ. డిసెంబర్ 28 ( గురునాథం జిల్లా బ్యూరో ) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మున్సిపల్ పట్టణ పరిధిలో గల లక్ష్మీపురం కాలనీలో శవాల మీద కూడా దందా చేసే స్థాయికి బీమా మాఫియా దిగజారిందన్న ఆరోపణలు కోదాడ మున్సిపాలిటీ పరిధిలో గల లక్ష్మీపురం కాలనీలో కలకలం రేపుతున్నాయి. గ్రామానికి చెందిన ఎస్.కె ముంతాజ్ బేగం తండ్రి మౌలాలి 12-04-2022న మృతి చెందగా ఆమె పేరుతో ఉన్న ప్రభుత్వ బీమా పాలసీని ఆధారం చేసుకుని కొందరు వ్యక్తులు ముందుగానే పథకం రచించి, రూ. 2.5 లక్షల రూపాయల క్లైమ్ ను దోచుకున్నారని బాధిత కుటుంబం తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చినది. ఎస్కే నసీమా (భర్త కరీం) తెలిపిన పూర్తి వివరాల ప్రకారం ముంతాజ్ బేగం జీవించి ఉన్న సమయంలోనే కొందరు వ్యక్తులు ఆమె దగ్గరికి వచ్చి లేబర్ కార్డు చేయిస్తాము ప్రభుత్వ పథకాల లబ్ది పొందవచ్చునని, నమ్మించి రూ. 50వేల రూపాయలు తీసుకున్నారని వారు తెలిపారు. లేబర్ కార్డు పేరు తో పథకం రచించి, ఆ తర్వాత లేబర్ కార్డు మాట మరిచి, ప్రశ్నించిన ప్రతిసారి తప్పించుకునే సమాధానాలు చెప్పారని ఆరోపించారు. తమ ఇంటికి బీమా అధికారులమని చెప్పుకున్న వ్యక్తులు వచ్చి, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమ యోజన కింద రూ. 2.50 లక్షల చెక్కు వచ్చిందని చెప్పడంతో అసలు మోసం బయటపడిందని నసీమా పేర్కొన్నారు. విచారణ చేయగా షాకింగ్ నిజాలు వెలుగు చూసాయని తెలిపారు. మృతురాలు ముంతాజ్ బేగం పేరుతో ఉన్న బీమా పాలసీకి సంబంధించి ఆమె జీవించి ఉన్నప్పుడు తీసుకున్న పత్రాలను అక్రమంగా ఉపయోగించి ఆమె మృతి చెందిన తర్వాత అసలు నామిని గా ఉన్న నసీమా పేరును తొలగించి అదే పేరుతో ఉన్న మరో మహిళను నామిని గా నమోదు చేసి బీమా క్లైమ్ చేసుకున్నట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారం తమకు తెలియకుండానే జరిగిందని బాధ్యత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ఇది ఒంటరి ఘటన కాదని గ్రామములో అమాయక ప్రజలను టార్గెట్ చేసి ప్రభుత్వ పథకాలు, భీమాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠా కార్యకలాపాలని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు అధికారకంగా ఫిరాదు చేయనున్నట్లు నసీమ స్పష్టం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఇలాంటి మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.

# 113 గ్రామాలకు తాగునీరు బంద్..



కృష్ణానది నీరు కాలుష్యంతో తాగునీటికి కూడా పనికిరాకుండా పోతోంది. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలవడం వల్ల సూర్యాపేట జిల్లాలోని 113 గ్రామాలకు 25 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వేలాది కుటుంబాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. అధికారులు నదిని శుభ్రం చేసి సమస్యన పరిష్కరించాలని ప్రజలు కోరతున్నారు. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లోనూ గండిపేట జలాశయంలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు కలపడం కలకలం రేపుతోంది. కృష్ణా నదిని కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు జీవనాధారమైన కృష్ణానది నీరు తీవ్ర కాలుష్యానికి గురవుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల్లో మురుగునీటిని, పారిశ్రామిక వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదలడం వల్ల తాగునీటికి కూడా పనికిరాని దుస్థితి ఏర్పడింది. దీనితో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 113 గ్రామాలకు గత 25 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఈ జిల్లాలో సాగునీరు, తాగునీటి అవసరాల కోసం కృష్ణా నదిపై ఆధారపడిన వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కృష్ణానదిని కాపాడాలని, కాలుష్యాన్ని అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.నదీ పరీవాహక ప్రాంతాల్లో మురుగునీటిని నేరుగా నదిలోకి వదిలేస్తున్నారు. అంతేకాకుండా, రాత్రివేళల్లో పారిశ్రామిక వ్యర్థాలను, రసాయనాలను తీసుకువచ్చి రహస్యంగా నదిలో కలుపుతున్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల కృష్ణానీరు తాగడానికి కూడా పనికిరాకుండా పోతోంది. దీంతో సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ జిల్లాలో గత 25 రోజులుగా 113 గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీనితో ఆయా గ్రామాల్లోని వేలాది కుటుంబాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. వ్యవసాయానికి, తాగడానికి కృష్ణానీటిపైనే ఆధారపడిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నదిని శుభ్రపర్చాలని, కాలుష్యానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇదిలా ఉంటే.. కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (ఫేజ్ ×) లో భారీ మరమ్మతులు, నిర్వహణ పనుల కారణంగా హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో సుమారు 36 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నేడు అనగా డిసెంబర్ 27, శనివారం ఉదయం 6 గంటల నుంచి 28 ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు నీటి సరఫరా నిలిచిపోనుంది. నగర ప్రజలకు మంచి నీరు అందిస్తోన్న గండిపేట జలాశయంలో కలుషితాలు కలుపుతున్న సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. సెప్టిక్ ట్యాంకులోని మల, మూత్ర విసర్జన వ్యర్థాలను జలాశయంలో వదులుతున్నారు. ఈ తతంగం ఎన్నాళ్ల నుంచి జరుగుతుందని, తాజాగా ఓ సెప్టిక్ ట్యాంక్ డ్రైవర్‌ని పట్టుకున్న స్థానికులు అధికారులకు అప్పగించారు. అలానే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. తాగే నీళ్లలో మనుషుల వ్యర్థాలు అన్‌లోడ్ వ్యవహారంపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు)పై విమర్శలు చేస్తున్నారు.

# ఈ నెలాఖరు వరకే కొత్త అగ్రిమెంట్లు



తెలంగాణలో

రైతులకు సౌర విద్యుత్ ప్లాంట్లపై కేంద్రం షాక్ ఇచ్చింది. పీఎం కుసుమ్ పథకం కింద కొత్త ఒప్పందాలు ఈ నెలాఖరుతో ఆగిపోనున్నాయి. రూ.3.13 ధరతో కొనుగోలు చేయడం డిస్కంలకు భారంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త ఏడాది నుంచి కొత్త ఒప్పందాలకు నో ఛాన్స్. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 3 వేల మెగావాట్ల కొనుగోలుకు సిద్ధమవుతోంది. తెలంగాణ రాష్ట్రంలోని రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి కిసాన్ ఊర్జ సురక్ష ఉత్థాన్ మహాభియాన్ పథకం కింద కొత్త విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ప్రక్రియను ఈ నెల 31తో నిలిపివేయాలని కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఆదేశించింది. కొత్త ఏడాది 2026 ప్రారంభం నుంచి ఎలాంటి కొత్త ఒప్పందాలకు అవకాశం లేదని స్పష్టం చేయడంతో రాష్ట్రంలోని రైతులకు మరియు ఇంధన రంగానికి ఇది ఒక ప్రధాన మలుపుగా మారింది. ఈ పథకం అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం టీజీ రెడ్కోను నోడల్ ఏజెన్సీగా నియమించింది. పథకం తొలి దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మెగావాట్ల సామర్థ్యమున్న సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ఆసక్తి చూపగా.. వివిధ కారణాల వల్ల కేవలం 1,450 మెగావాట్లకు మాత్రమే ఒప్పందాలు కుదిరాయి. ప్రస్తుతం ఈ ప్లాంట్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కాగా, రెండో దశ కింద మరో 20 వేల మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అయితే రెండో దశపై కేంద్రం నుండి ఇంకా స్పష్టత రాకపోవడంతో.. ప్రస్తుతానికి కొత్త పీపీఏలను నిలిపివేయాల్సి వచ్చింది.ఈ నిర్ణయం వెనుక విద్యుత్ ధరల అంశం ప్రధానంగా కనిపిస్తోంది. తొలి దశ ఒప్పందాల ప్రకారం.. రైతుల నుంచి కొనుగోలు చేసే సౌర విద్యుత్‌కు యూనిట్‌కు రూ. 3.13 చెల్లించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (జు=జ) గతంలో నిర్ణయించింది. అయితే.. ప్రస్తుత మార్కెట్‌లో సౌర విద్యుత్ ధరలు యూనిట్‌కు రూ. 3 కంటే తక్కువకే లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కువ ధర వెచ్చించి ఒప్పందాలు చేసుకోవడం వల్ల డిస్కంలపై భారం పడుతుందని భావిస్తున్నారు. అందుకే, రూ. 3.13 ధరతో ఒప్పందాలు చేసుకోవడానికి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు సిద్ధంగా లేవు.మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మూడేళ్లలో ఏటా వెయ్యి మెగావాట్ల చొప్పున మొత్తం 3 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీని కోసం రెడ్కో త్వరలోనే టెండర్లు పిలవనుంది. ఈ టెండర్లలో ప్రైవేటు కంపెనీలు కోట్ చేసే అత్యంత తక్కువ ధరను ప్రామాణికంగా తీసుకుని భవిష్యత్తులో పీఎం కుసుమ్ రెండో దశ కింద రైతులకు ఇచ్చే ధరను ఈఆర్సీ సవరించే అవకాశం ఉంది. తద్వారా అటు రైతులకు గిట్టుబాటు ధర, ఇటు డిస్కంలకు ఆర్థిక వెసులుబాటు కలిగేలా కొత్త విధానాన్ని రూపొందించనున్నారు.

# దొంగల బీభత్సం.. రాత్రికి రాత్రి రూ. 30 లక్షలు మాయం



నిజామాబాద్‌లో రాత్రికి రాత్రే రెండు ఏటీఎంలను టార్గెట్ చేసి సుమారు 30 లక్షల రూపాయలు ఎత్తుకెళ్లిన దొంగల వ్యవహారం కలకలం రేపుతోంది. గ్యాస్ కట్టర్లతో ఏటీఎంలను ధ్వంసం చేసిన దుండగులను పట్టుకునేందుకు పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సీసీటీవీ ఫుటేజీలు, వేలిముద్రల ఆధారంగా దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. నిజామాబాద్ నగరంలో భారీ ఏటీఎం దోపిడీ కలకలం రేపింది. ఒకే రాత్రి రెండు వేర్వేరు ప్రాంతాల్లోని ఏటీఎంలను లక్ష్యంగా చేసుకున్న దుండగులు.. సుమారు రూ. 30 లక్షల నగదుతో పరారయ్యారు. ఈ ఘటనపై నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ (కామారెడ్డి ఎస్పీ) శ్రీ ఎం. రాజేష్ చంద్ర శనివారం ఉదయం స్వయంగా రంగంలోకి దిగి సంఘటనా స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున నగరంలోని టౌన్-4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగ్రా రోడ్డులో ఉన్న డీసీబీ బ్యాంకు ఏటీఎం.. అలాగే టౌన్-5 పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద గల ఎస్బీఐ ఏటీఎంలపై దొంగలు దాడి చేశారు. గ్యాస్ కట్టర్ల సాయంతో ఏటీఎంలను ధ్వంసం చేసి.. అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం రూ. 30 లక్షల వరకు నగదు చోరీకి గురైనట్లు తెలుస్తోంది.ఘటనా స్థలానికి చేరుకున్న ఇంచార్జి సీపీ రాజేష్ చంద్ర .. దొంగలు ప్రవేశించిన మార్గాలను, వారు అనుసరించిన విధానాన్ని పరిశీలించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకగా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో వేలిముద్రలు సేకరించారు. ఏటీఎం లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.నగరంలోని బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద రాత్రి సమయాల్లో మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని ఆదేశించారు. ఏటీఎం కేంద్రాల్లో అలారం వ్యవస్థలను ఆధునీకరించాలని, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీపీ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ పర్యవేక్షణలో అదనపు డీసీపీ జి. బస్వారెడ్డి, ఏసీపీ రాజా వెంకటరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, స్థానిక ఎస్‌హెచ్ఓలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.




# కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త చరిత్ర



భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ టీ 20ల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్‌గా కొత్త చరిత్ర సృష్టించింది. శ్రీలంకతో జరుగుతున్న టీ 20 సిరీస్‌లో భాగంగా మూడో మ్యాచ్ గెలుపుతో ఆమె మెగ్ లానింగ్ రికార్డును అధిగమించింది. మరోవైపు టీమిండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ టీ 20ల్లో 1000 పరుగులు, 150 వికెట్లు సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచింది. ఈ విజయంతో భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన రికార్డుతో 2025 ఏడాదిని మరింత ప్రత్యేకంగా మార్చుకుంది. శ్రీలంకతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించగా, ఈ గెలుపుతో మహిళల టీ 20ల్లో అత్యధిక విజయాలు సాధించిన కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కొత్త చరిత్ర సృష్టించింది. శ్రీలంకపై విజయంతో హర్మన్‌ప్రీత్ కౌర్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ 76 విజయాల రికార్డును అధిగమించింది. ఇప్పటివరకు హర్మన్ ప్రీత్ 130 టీ20 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించి, 77 విజయాలు నమోదు చేసింది. ఇదే సమయంలో టీ 20ల్లో అత్యధిక మ్యాచ్‌లకు కెప్టెన్‌గా కొనసాగిన ఘనత కూడా హర్మన్‌ప్రీత్‌కే దక్కింది. ఈ మ్యాచ్‌లో మరో విశేషం దీప్తి శర్మ ఖాతాలో పడింది. టీ20ల్లో 1000 పరుగులు చేయడంతో పాటు 150 వికెట్లు సాధించిన తొలి క్రికెటర్‌గా ఆమె రికార్డు నెలకొల్పింది. మూడో టీ 20లో మూడు వికెట్లు తీసిన దీప్తి, మొత్తం 151 వికెట్లతో ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్‌తో కలిసి మహిళల టీ 20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. రేణుకా సింగ్ ఠాకూర్ నాలుగు వికెట్లతో చెలరేగగా, శ్రీలంక 20 ఓవర్లలో 112 పరుగులకే పరిమితమైంది. అనంతరం లక్ష్య ఛేదనలో షఫాలి వర్మ 79 పరుగులతో ఆకట్టుకోగా, భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించి సులువైన విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3 – 0తో మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్ అనంతరం హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ టీ20 వరల్డ్‌కప్‌కు ముందు తమ ఆటను మరో స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని, ఈ సిరీస్‌లో బౌలింగ్ విభాగం అద్భుతంగా పనిచేసిందని పేర్కొంది. భారత్ ఉ శ్రీలంక మధ్య నాలుగో టీ 20 మ్యాచ్ డిసెంబర్ 28న తిరువనంతపురంలో జరగనుంది.

# గౌతమ్ గంభీర్‌కు బీసీసీఐ షాక్?




దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో భారత్ ఘోర పరాజయంతో కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో బీసీసీఐ టెస్టు కోచింగ్ విషయంలో పునరాలోచనలో పడిందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీసీసీఐ బృందం టెస్టు జట్టుకు కోచ్‌గా వ్యవహరించాలంటూ వీవీఎస్ లక్ష్మణ్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గౌతమ్ గంభీర్ వైట్ బాల్‌తో సక్సెస్ అయినా, టెస్టుల్లో సేనా దేశాలపై వైఫల్యాలు చర్చనీయాంశమయ్యాయి. టీ 20 ప్రపంచకప్ ప్రదర్శన ఆధారంగా గంభీర్ భవిష్యత్తు తేలనుంది. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో టీమిండియా ఘోరంగా ఓటమిపాలయింది. సొంతగడ్డపై ఇంత దారుణంగా ఓడిపోవడంతో గౌతమ్ గంభీర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. గంభీర్‌ను కోచ్‌గా తొలగించాలంటూ ధర్మశాలలో ఫ్యాన్స్ ఏకంగా గోల చేశారు. ఆ తర్వాత గంభీర్ కూడా టెస్టు కోచ్‌గా బీసీసీఐ ఇంకెవర్నయినా తీసుకుంటుందేమో అన్నట్టు వ్యాఖ్యలు కూడా చేశాడు. ఈ నేపథ్యం టెస్టు జట్టు కోచింగ్ విషయంలో బీసీసీఐ అంతర్గతంగా పునరాలోచన ప్రారంభించినట్టు సమాచారం. భారత క్రికెట్ బోర్డులో కీలక స్థాయిలో ఉన్న వ్యక్తులు, మాజీ దిగ్గజ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌ను సంప్రదించి, రెడ్ బాల్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాలనే అంశంపై ఆసక్తి ఉందా అని ఆరా తీసినట్టు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో హెడ్ ఆఫ్ క్రికెట్‌గా కొనసాగుతున్న లక్ష్మణ్, అదే బాధ్యతలో సంతృప్తిగా ఉన్నారని, సీనియర్ టెస్టు జట్టుకు కోచింగ్ చేయడంపై ఆసక్తి చూపలేదని సమాచారం. గౌతమ్ గంభీర్ భారత వైట్ బాల్ జట్ల కోచ్‌గా ఐసీసీ, ఏసీసీ ట్రోఫీలతో విజయవంతమైన రికార్డు కలిగి ఉన్నప్పటికీ, టెస్టు ఫార్మాట్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. ముఖ్యంగా సేనా (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై 10 టెస్టు పరాజయాలు గంభీర్‌పై విమర్శలకు దారి తీస్తున్నాయి. గంభీర్‌కు 2027 వన్డే ప్రపంచకప్ వరకు బీసీసీఐ కాంట్రాక్ట్ ఉన్నప్పటికీ, వచ్చే ఐదు వారాల్లో ప్రారంభమయ్యే టీ20 ప్రపంచకప్‌లో భారత ప్రదర్శన ఆధారంగా ఈ ఒప్పందంపై తిరిగి సమీక్ష జరిగే అవకాశం ఉందని బోర్డు వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం 2025ఉ27 వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో మిగిలిన తొమ్మిది టెస్టులకు గంభీర్ టెస్టు కోచ్‌గా కొనసాగాలా? అనే అంశంపై బీసీసీఐలో స్పష్టత లేదని సమాచారం. రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా ఉన్న సమయంలో ఆటగాళ్ల పాత్రలు స్పష్టంగా ఉండేవని, ప్రదర్శనకు తగిన సమయం కూడా దక్కేదని ఆటగాళ్ల వర్గాల్లో అభిప్రాయం ఉంది. అయితే గంభీర్ కోచ్‌గా కొనసాగుతున్న ఈ సమయంలో చాలామంది ఆటగాళ్లు భద్రత లేకుండా ఉన్నారని భావిస్తున్నారని కథనాలు చెబుతున్నాయి. టీ20 ప్రపంచకప్ జట్టు నుంచి శుభ్‌మన్ గిల్‌ను తప్పించడం కూడా ఈ భావనకు బలం చేకూర్చిందని విశ్లేషకులు అంటున్నారు. భారత క్రికెట్‌లో తదుపరి పెద్ద స్టార్‌గా భావిస్తున్న ఆటగాడినే పక్కన పెట్టినప్పుడు, ఎవరికైనా జట్టులో స్థానం ప్రమాదంలో పడవచ్చన్న భావన డ్రెస్సింగ్ రూమ్‌లో నెలకొందని సమాచారం. టీ20 ప్రపంచకప్ అనంతరం రెండు నెలల పాటు ఐపీఎల్ జరగనుండటంతో, కోచింగ్ విధానంపై, స్ప్లిట్ కోచింగ్ లేదా ఒకే కోచ్ కొనసాగాలా అన్న అంశంపై బీసీసీఐకి నిర్ణయం తీసుకునేందుకు సమయం ఉంటుందని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. అంతేకాకుండా గంభీర్‌కు బీసీసీఐలో బలమైన మద్దతు ఉన్నప్పటికీ, వచ్చే రెండు నెలలు భవిష్యత్తును నిర్ణయించే కీలక కాలంగా మారనున్నాయని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# రికార్డుకు బ్రేక్..

15 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ, ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ టెస్టు విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో గెలిచి, వరుస ఓటముల శాపాన్ని వదిలించుకుంది. ఈ అద్భుతమైన కమ్ బ్యాక్ ఇంగ్లండ్ క్రికెట్ అభిమానులకు ఆనందాన్నిచ్చింది. బెన్ డకెట్, జాక్ క్రాలీల అద్భుత భాగస్వామ్యం జట్టుకు విజయాన్ని అందించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఇంగ్లండ్ జట్టు చివరిసారిగా 2011లో సిడ్నీ వేదికగా జరిగిన టెస్టు మ్యాచ్‌లో గెలిచింది. ఇంగ్లండ్‌కు ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిపోయిన ఆస్ట్రేలియాలో టెస్టు విజయం.. 15 ఏళ్ల తర్వాత నెరవేరింది. యాషెస్ సిరీస్ అటు ఆస్ట్రేలియా, ఇటు ఇంగ్లండ్‌కు ఎంతో ప్రతిష్టాత్మకమైంది. అలాంటి యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో అడుగుపెట్టిన ప్రతిసారీ ఇంగ్లండ్‌కు ఘోర అవమానమే మిగిలింది. 2011 తర్వాత ఇప్పటి వరకు ఆస్ట్రేలియాలో ఇంగ్లండ్ ఒక్కసారి కూడా టెస్టు మ్యాచ్ గెలవలేదు. అలాంటి శాపం నుంచి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఇంగ్లండ్‌కు విముక్తి లభించింది.




# ఒకే రోజు 20 వికెట్లు పడటమేంటీ!




యాషెస్ సిరీస్‌లో మెల్‌బోర్న్ టెస్టు తొలి రోజే 20 వికెట్లు పడిపోయి, పిచ్‌పై తీవ్ర చర్చకు దారితీసింది. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్, ఎంసీజీ పిచ్‌ను 'మంచి టెస్ట్ పిచ్ కాదు' అని విమర్శించాడు. బౌలర్లకు విపరీతంగా సహకరిస్తూ, బ్యాటర్లకు కష్టతరం చేస్తోందని, ఇది కొంత అన్యాయమని కుక్ అభిప్రాయపడ్డాడు. స్కాట్ బోలాండ్ బౌలింగ్‌ను మాత్రం ప్రశంసించాడు. తొలి రోజు ఆస్ట్రేలియా 152 పరుగులకు ఆలౌట్ అయితే, ఇంగ్లండ్ 110 పరుగులకే కుప్పకూలింది. యాషెస్ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టు తొలి రోజే తీవ్ర చర్చకు దారితీసింది. ఒక్క రోజులోనే 20 వికెట్లు పడిపోవడంతో, పిచ్ స్వభావంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ , ఎంసీజీ పిచ్‌ను తీవ్రంగా తప్పుబట్టాడు. శుక్రవారం జరిగిన తొలి రోజు ఆటలో ఇంగ్లండ్ బౌలర్లు ఆస్ట్రేలియాను 152 పరుగులకే కట్టడి చేశారు. జోష్ టంగ్ ఐదు వికెట్లతో రాణించాడు. అయితే, అదే పిచ్‌పై బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు కేవలం 110 పరుగులకే ఆలౌట్ అయింది. మైఖేల్ నేసర్, స్కాట్ బోలాండ్ కలిసి ఏడు వికెట్లు తీసి ఇంగ్లండ్ ఆశలను దెబ్బతీశారు. ఫలితంగా ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగుల ఆధిక్యం సాధించింది. ఓ స్పోర్ట్స్ వేదికపై జరిగిన చర్చలో పాల్గొన్న అలిస్టర్ కుక్ ఎంసీజీ పిచ్‌పై స్పందించాడు. "ఇది మంచి టెస్ట్ పిచ్ కాదు. రెండు, మూడు, నాలుగో రోజు పిచ్ సద్దుమణగకపోతే, ఇది పూర్తిగా బౌలర్లకు అనుకూలంగా తయారైన వికెట్. బౌలర్లు వికెట్లు తీయడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు" అని కుక్ పేర్కొన్నాడు. బ్యాటర్లు విఫలమయ్యారని విమర్శించవచ్చని అంగీకరించినప్పటికీ, పరిస్థితులు చాలా క్లిష్టంగా ఉన్నాయని కూడా కుక్ స్పష్టం చేశాడు. "రెండు జట్ల బ్యాటింగ్‌లో లోపాలు ఉన్నాయి. కానీ సరైన లెంగ్త్‌లో బంతి వేస్తే, అది రెండు వైపులా మూవ్ అవుతోంది. ఇది కొంత అన్యాయమే" అని అన్నాడు. అయితే కుక్ స్కాట్ బోలాండ్ బౌలింగ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించాడు. ముఖ్యంగా లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లపై అతను చూపించిన నియంత్రణ అసాధారణమని అన్నాడు. "బోలాండ్‌ను చూస్తూ 'ఇతన్నెలా ఎదుర్కోవాలి?' అనిపించింది. రౌండ్ ద వికెట్ నుంచి స్టంప్స్‌పై దాడి చేస్తూ కొన్ని బంతులు లోపలికి, కొన్ని బయటికి బాగా కదులుతున్నాయి. కుడిచేతి బ్యాటర్లకు కూడా ఆడటానికి మార్గం కనిపించడం లేదు" అని కుక్ వ్యాఖ్యానించాడు. పిచ్ రెండో రోజు కొంత మెరుగుపడవచ్చని ఆశించినప్పటికీ, గ్రౌండ్స్‌మన్ నుంచి వచ్చిన సమాచారం ఆందోళన కలిగించిందని కుక్ వెల్లడించాడు. "పిచ్ రేపు సద్దుమణగొచ్చని ఆశిస్తున్నాను. కానీ గ్రౌండ్స్‌మన్ మాత్రం అలా జరుగుతుందని అనుకోవడం లేదని చెప్పారు" అని తెలిపాడు.

# రెండో రోజుకే టెస్టు ముగుస్తుందా?



యాషెస్ నాలుగో టెస్టులో ఎంసీజీ పిచ్ బౌలర్లకు స్వర్గధామంగా మారింది. తొలి రోజే 20 వికెట్లు పడగా ఆసీస్, ఇంగ్లండ్ బ్యాటర్లు తేలిపోయారు. రెండో రోజు కూడా బౌలర్లదే హవా కొనసాగింది. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లండ్‌కు 175 పరుగుల లక్ష్యం. రెండో రోజు ఆటలోనే ఫలితం తేలేలా ఉంది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 4, బెన్ స్టోక్స్ 3, జోష్ టంగ్ 2 వికెట్లు తీసుకున్నారు. యాషెస్ సిరీస్ నాలుగో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. తొలి రోజే 20 వికెట్లు పడటంతో ఎంసీజీ పిచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. పేస్ బౌలింగ్‌కు బాగా సహకరిస్తుండటంతో అటు ఆసీస్, ఇటు ఇంగ్లండ్ బౌలర్లు రెచ్చిపోయి బౌలింగ్ చేస్తున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 152 పరుగులకే ఆలౌట్ అయిన ఆస్ట్రేలియా, రెండో ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు పది వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే ఇంగ్లండ్ కుప్పకూలడంతో.. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లిష్ జట్టు విజయానికి 175 పరుగులు కావాల్సి వచ్చింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో బౌలర్ల హవా కొనసాగుతోంది. తొలి రోజు మూడో సెషన్‌కే ఇంగ్లండ్ జట్టు ఆలౌట్ అవడంతో.. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. ఒకే ఒక్క ఓవర్ సాగడంతో ఆసీస్ నైట్ వాచ్‌మన్‌గా స్కాట్ బోలాండ్‌ను దింపింది. అయితే వికెట్లేమీ పడకుండా కేవలం నాలుగు పరుగులు మాత్రమే చేసింది. 4/0 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా జట్టు ఆరంభంలో దీటుగానే ఎదుర్కొంది. ట్రావిస్ హెడ్ అటాకింగ్ బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. దాంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటర్లకు అనుకూలిస్తుందని అందరూ అనుకున్నారు. ఆ లోపే వరుస వికెట్లు పడటం మొదలయ్యాయి. హెడ్ మినహా మిగతా టాప్ 4 బ్యాటర్లు సింగిల్ డిజిట్స్‌కే పెవిలియన్ బాట పట్టారు. బోలాండ్ 6, జేక్ వెధరాల్డ్ 5, లబుషేన్ 8 పరుగులకే అవుటవ్వగా.. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ స్మిత్‌తో కలిసి హెడ్ కాసేపు ఇన్నింగ్స్ కొనసాగించాడు. అయితే 67 బంతుల్లో 46 పరుగులు చేసి హెడ్ బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. ఆ వెంటనే ఉస్మాన్ ఖ్వాజా డకౌట్ కావడం, క్యారీ కూడా 4 పరుగులకే పెవిలియన్ బాట పట్టడంతో ఆస్ట్రేలియా 88 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. 100 పరుగుల లోపే ఇన్నింగ్స్ క్లోజ్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ గ్రీన్ – స్మిత్ ఏడో వికెట్‌కు 31 పరుగులు జోడించారు. గ్రీన్ అవుటవ్వడంతో.. నేసర్, స్టార్క్, రిచర్డ్‌సన్ వెంటవెంటనే అవుటయ్యారు. కెప్టెన్ స్మిత్ 24 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 4, స్టోక్స్ 3, జోష్ టంగ్ 2, అట్కిన్‌సన్ ఒక వికెట్ పడగొట్టారు. ఇంగ్లండ్ విజయానికి 175 పరుగులు కావడం, ఇంకో రెండు సెషన్‌లు సమయం ఉండటంలో రెండో రోజుకే ఫలితం వస్తుందని అందరూ ఆశిస్తున్నారు.


# 'అది క్యాచ్ కాదా?'..




మెల్‌బోర్న్ టెస్టులో అంపైరింగ్ వివాదం, లబుషేన్ ఔట్ నిర్ణయంపై తీవ్ర చర్చ. స్నికో లోపాలపై ఇప్పటికే విమర్శలున్న నేపథ్యంలో ఈ సంఘటన కలకలం రేపింది. మ్యాచ్‌లో ఇంగ్లండ్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి, 15 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై గెలుపొందింది. రెండు రోజుల్లోనే ముగిసిన టెస్టుపై విమర్శలు వెల్లువెత్తాయి. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన యాషెస్ నాలుగో టెస్టు రెండో రోజు పెద్ద అంపైరింగ్ వివాదానికి వేదికైంది. ఆస్ట్రేలియా బ్యాటర్ మార్నస్ లబుషేన్ వికెట్ విషయంలో తీసుకున్న థర్డ్ అంపైర్ నిర్ణయం తీవ్ర చర్చకు దారి తీసింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 18వ ఓవర్‌లో ఇంగ్లండ్ పేసర్ జోష్ టంగ్ బౌలింగ్‌లో లబుషేన్ ఎడ్జ్ ఇచ్చాడు. స్లిప్‌లో జో రూట్ అందుకున్న క్యాచ్‌పై ఇంగ్లండ్ ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేయగా, లబుషేన్ మాత్రం క్యాచ్ క్లీన్‌గా పట్టలేదన్న భావనతో క్రీజ్‌లోనే నిలిచాడు. ఫీల్డ్ అంపైర్ ఈ నిర్ణయాన్ని థర్డ్ అంపైర్‌కు అప్పగించాడు. పలు కోణాల నుంచి రీప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్, బంతి నేలను తాకలేదని, రూట్ వేళ్లు బంతి కింద ఉన్నాయని పేర్కొంటూ అవుట్‌గా ప్రకటించాడు. ఈ నిర్ణయంతో లబుషేన్ తీవ్ర అసహనంతో పెవిలియన్‌కు చేరాడు. అతని నిరాశ స్పష్టంగా కనిపించడంతో సోషల్ మీడియాలోనూ ఈ నిర్ణయంపై చర్చ మొదలైంది. యాషెస్ సిరీస్‌లో డీఆర్ఎస్ స్నికోపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వచ్చాయి. అటు ఆస్ట్రేలియాతో పాటు ఇటు ఇంగ్లండ్ ప్లేయర్లు కూడా స్నికో తప్పిదాలతో ఇబ్బంది పడ్డారు. అడిలైడ్ టెస్టులో అలెక్స్ క్యారీ అవుటయినప్పటికీ అది నాటౌట్‌గా చూయించడంతో చివరికి ఐసీసీనే నేరుగా స్పందించాల్సి వచ్చింది. దాని తర్వాత ఇప్పుడు లబుషేన్ క్యాచ్‌పై కూడా భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.




# 'పుష్ప 2' తొక్కిసలాట కేసులో ఛార్జ్‌షీట్..



'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏడాది తర్వాత చిక్కడపల్లి పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇందులో అల్లు అర్జున్‌తో పాటు మొత్తం 23 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. థియేటర్ యాజమాన్యంతో పాటు, బన్నీ మేనేజర్, వ్యక్తిగత సిబ్బంది, బౌన్సర్లను ఛార్జ్ షీట్‌లో చేర్చారు. సంధ్య థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్' సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగి ఇటీవలే ఏడాది పూర్తయింది. అయితే ఈ కేసులో ఇప్పుడు కీలక పరిణామం చోటుచేసుకుంది. తొక్కిసలాట ఘటనపై చిక్కడపల్లి పోలీసులు ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఇందులో అల్లు అర్జున్ పేరుని కూడా చేర్చారు.'పుష్ప 2' తొక్కిసలాట కేసులో 23 మంది నిందితులను పోలీసులు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. సంధ్య థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తొక్కిసలాట జరిగిందని నిర్ధారించారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ఏ1గా, హీరో అల్లు అర్జున్‌ను ఏ11గా చేర్చారు. అలానే బన్నీ మేనేజర్, ఆయన వ్యక్తిగత సిబ్బందితో సహా 8 మంది బౌన్సర్లపై ఛార్జ్ షీట్‌లో దాఖలైనట్లు తెలుస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్, రష్మిక మందన్న హీరో హీరోయిన్లుగా నటించిన 'పుష్ప 2' సినిమా 2024 డిసెంబర్ 5న రిలీజయింది. ముందు రోజు రాత్రి భారీ స్థాయిలో ప్రీమియర్లు ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్లో కూడా ప్రీమియర్ షో వేశారు. అయితే అదే సమయంలో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో థియేటర్ దగ్గర తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మరణించగా.. ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్ర తీవ్రంగా గాయపడ్డాడు.సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్ ను చిక్కడపల్లి పోలీసులు ఇంటికి వెళ్లి మరీ అరెస్ట్ చేశారు. ఒక రోజు రాత్రి జైలు జీవితం గడిపిన తర్వాత, మరునాడు ఉదయం బెయిల్ పై బయటకు వచ్చారు. కొన్ని నెలల పాటు ఈ వివాదం హాట్ టాపిక్ గా నడిచింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెర్సెస్ అల్లు అర్జున్ అనే విధంగా అనేక వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. తొక్కిసలాట ఘటనపై సీఎం రేవంత్ ఏకంగా అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఆ సమయంలో బన్నీ ఇంటిపై కొందరు దాడులు కూడా చేశారు. అయితే తొక్కిసలాట జరిగిన ఏడాది తర్వాత ఇప్పుడు ఈ కేసులో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే, ప్రమాదం జరిగి ఏడాది గడిచినా శ్రీతేజ్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఇప్పటికీ మాట్లాడలేని, నడవలేని స్థితిలో ఉన్నాడు. రేవతి కుటుంబాన్ని ఆదుకోడానికి అల్లు అర్జున్ ముందుకు వచ్చారు. శ్రీతేజ్ కోసం రూ. 2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అలానే వైద్య ఖర్చులు భరిస్తున్నారు. ఇప్పటివరకు రేవంత్ కుటుంబానికి బన్నీ తరపున రూ. 3.25 కోట్లు సాయం అందిందని ఇటీవల దిల్ రాజు తెలిపారు. శ్రీతేజ్ పూర్తిగా కోలుకునేంత వరకు వైద్య ఖర్చులు భరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

# సూర్య కొత్త సినిమా స్టోరీ లైన్ ఇదే!



సూర్య 46వ సినిమా స్టోరీ లైన్ బయటకొచ్చింది! 45 ఏళ్ల వ్యక్తికి, 20 ఏళ్ల అమ్మాయికి మధ్య ఉండే రిలేషన్, వాళ్ల మధ్య అల్లరి, లవ్, ఎమోషన్స్, ఫన్ ఎలా ఉంటాయో చూపించబోతున్నారట. 25 ఏళ్ల ఏజ్ గ్యాప్ ఉన్న వీరి ప్రేమ కథ ఆసక్తికరంగా ఉండబోతుందని నిర్మాత నాగవంశీ తెలిపారు. సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కెరీర్ ప్రారంభం నుంచీ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. గత కొన్ని చిత్రాలతో నిరాశ పరిచయ సూర్య.. ఈసారి ఎలాగైనా సక్సెస్ ట్రాక్ ఎక్కాలని కష్టపడుతున్నారు. ఇందులో భాగంగా మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టారు. ఇవి మూడూ వేటికవే ప్రత్యేకమైన సినిమాలు. వాటిల్లో ఒకటి టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరెకెక్కుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'హబతీఅఖు 46' అనే వర్కింగ్ టైటిల్ తో రూపొందుతున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా నిర్మాత నాగవంశీ ఈ సినిమాకి సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు.సూర్య 46వ సినిమాలో 'ప్రేమలు' బ్యూటీ మమితా బైజు హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్, బాలీవుడ్ నటి రవీనా టాండన్ ఓ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమా జోనర్ ఏంటి? ఎలాంటి కథతో రాబోతున్నారు? అని తెలుసుకోవాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో లేటెస్టుగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. సూర్య సినిమా స్టోరీ లైన్ ఏంటనేది రివీల్ చేశారు. 20 ఏళ్ల అమ్మాయికి 45 ఏళ్ల వ్యక్తికి మధ్య జరిగే కథ ఇదని తెలిపారు. షూటింగ్ కూడా చివరికి వచ్చేసిందని చెప్పారు. "సూర్య 46' షూటింగ్ ఇంకో రెండు రోజుల్లో అయిపోతుంది. సూర్య 'గజినీ'లోని రిచ్ సంజయ్ స్వామి క్యారక్టర్ ప్లే చేస్తున్నారు. 45 ఏళ్ల వ్యక్తికి, 20 ఏళ్ల అమ్మాయికి మధ్య ఉన్న సంబంధం గురించిన కథ ఇది. వాళ్లిద్దరి మధ్య అల్లరి, ర్యాపో, రిలేషన్, ఎమోషన్, ఫన్, లవ్ ఎలా ఉంటుందనేది చూపించబోతున్నాం. 25 ఏళ్ల వ్యత్యాసం ఉన్న ఇద్దరి మధ్య ప్రేమ ఉండొచ్చా? ఉండకూడదా? వంటి అంశాలతో రూపొందుతోంది" అని నాగవంశీ వెల్లడించారు.'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వరుస బ్లాక్ బస్టర్లతో దూకుడు మీద ఉన్న వెంకీ అట్లూరి, 'సూర్య 46' సినిమాతో సితార సంస్థకు హ్యాట్రిక్ హిట్ ఇవ్వాలని చూస్తున్నారు. కమర్షియల్ ఎలిమెంట్స్ తో పాటు సామాజిక స్పృహ, బలమైన ఎమోషన్స్ ఉండేలా కథను సిద్ధం చేశారని నాగవంశీ చెప్పినదాన్ని బట్టి అర్ధమవుతోంది.

# నా ఫ్యామిలీని ఎందుకు లాగుతున్నారు..



హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదంలో యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ పేరు గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. శివాజీ వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించిన అనసూయ, తన డ్రెస్ విషయంలో ఎవరి సలహా అవసరం లేదని స్పష్టం చేసింది. దీనికి శివాజీ వ్యంగ్యంగా కౌంటర్ ఇవ్వడంతో వివాదం మరింత ముదిరింది. తాజాగా ఆమె మీడియాని ఉద్దేశిస్తూ ఇన్‌స్టాలో పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది. హీరోయిన్ల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు గత నాలుగైదు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. "హీరోయిన్లు నిండుగా బట్టలు వేసుకోవాలి" అన్న ఆయన మాటలపై అనేక మంది సెలబ్రిటీలు స్పందించగా, అందులో యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ఘాటుగా రియాక్ట్ కావడం ఈ వివాదానికి మరింత మంట రాజేసింది. తన డ్రెస్ విషయంలో శివాజీ నుంచి సలహాలు తీసుకోవాల్సిన అవసరం లేదంటూ అనసూయ బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రతిగా శివాజీ కూడా వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తూ "మీ రుణం త్వరలోనే తీర్చుకునే అవకాశం రావాలని కోరుకుంటున్నాను" అంటూ స్పందించారు. ఈ మాటలు మరింత వివాదాస్పదంగా మారాయి. ఇదే సమయంలో అనసూయ నిన్న శారీలో ఫోటోలు, బికినీ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడం, శివాజీని రెచ్చగొట్టేందుకే అన్న చర్చ నడవడంతో విమర్శలు కూడా వెల్లువెత్తాయి. శివాజీ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా అనసూయ మరోసారి తన అసహనాన్ని వ్యక్తం చేసింది. "నేను చాలా సందర్భాల్లో హద్దులు దాటకుండా మౌనంగా వచ్చాను. మీ మద్దతు నాకు అవసరం లేదు. నన్ను నేను ఎలా రక్షించుకోవాలో నాకు తెలుసు" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో అటు శివాజీ, ఇటు అనసూయ ఇద్దరూ ట్రోలింగ్‌కు గురవుతున్నారు. ఒక వర్గం అనసూయ వ్యక్తిగత స్వేచ్ఛను సమర్థిస్తుంటే, మరో వర్గం శివాజీ మాటల్లోని ఉద్దేశాన్ని సమర్థిస్తోంది.తనపై మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఉద్దేశించి అనసూయ తాజాగా మరో పోస్ట్ పెట్టింది. అందులో కొంతమంది వ్యక్తులు, బాధ్యతారహిత మీడియా సంస్థలు తన మాటలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తూ ప్రజలను రెచ్చగొట్టే కథనాలు సృష్టిస్తున్నారని ఆరోపించింది. ఇవన్నీ సాధారణ ప్రజలను అయోమయానికి గురిచేయడానికే అని ఆమె స్పష్టం చేసింది. తన మాటల అర్థాన్ని మార్చి, మోసపూరిత నారేటివ్‌ను ప్రచారం చేస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'కొంతమంది రాబందుల్లాంటి వ్యక్తులౌ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న కొన్ని మీడియా సంస్థలౌ స్మార్ట్‌ఫోన్‌లు, మైకులు చేతబట్టి తిరిగే కొంతమంది సామాజిక అక్షరాస్యత లేని వారౌ నా మాటలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి, తమకు అనుకూలంగా మోసపూరిత కథనాలను సృష్టించారు. ఈ కథనాలన్నీ ప్రజలను రెచ్చగొట్టడం, అయోమయానికి గురిచేయడం, సాధారణ పురుషులు-మహిళలను తప్పుదోవ పట్టించడం కోసమే రూపొందించబడ్డవి' అంటూ అనసూయ ఘాటుగా పోస్ట్ చేసింది.ఈ క్రమంలో అనసూయ ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో కూడా మాట్లాడింది. "అతి వినయం దూర్త లక్షణం అనే మాటను నేను జీవితంలో నేర్చుకున్నాను. అమ్మ, తల్లి అంటూ మాట్లాడేవారిలో కొందరు చాలా డేంజరస్. ఇటీవల కొన్ని వీడియోలు చూసినప్పుడు అదే అనిపించింది" అంటూ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. తనపై వచ్చిన విమర్శలకు తాను భయపడనని, అవసరమైతే గట్టిగా స్పందిస్తానని ఆమె చెప్పింది. మొత్తానికి, శివాజీ వ్యాఖ్యలతో మొదలైన ఈ వివాదం ఇప్పుడు అనసూయ సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, కౌంటర్ స్టేట్‌మెంట్లతో మరింత పెద్ద చర్చగా మారింది. వ్యక్తిగత స్వేచ్ఛ, అభిప్రాయ స్వాతంత్ర్యం, సంస్కారం అనే అంశాలపై ఈ వ్యవహారం రెండు వర్గాల మధ్య తీవ్ర వాదనకు దారి తీసింది. ఈ వివాదం ఎక్కడ వరకు వెళ్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అందుకే ఇంకా పెళ్లి చేసుకోలేదు



మారుతి దర్శకత్వంలో వస్తున్న 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రభాస్ పెళ్లిపై సరదాగా స్పందించారు. పెళ్లి చేసుకోవాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలో తెలియకే ఇంకా పెళ్లి చేసుకోలేదని నవ్వుతూ చెప్పారు. నిధి అగర్వాల్‌ను పెళ్లి చేసుకోవాలంటే ప్రేమించే వృత్తి ఉండాలని మరో అభిమాని ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ వంటి ముగ్గురు అందాల భామలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర బృందం ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ సందర్భంగా పెళ్లిపై ప్రభాస్ సరదాగా మాట్లాడారు. 'ది రాజాసాబ్' ఈవెంట్ లో ప్రభాస్ పెళ్లి ప్రస్తావన వచ్చింది. "ప్రభాస్ ని పెళ్లి చేసుకోవాలంటే మాకు ఉండాల్సిన క్వాలిటీస్ ఏమిటి?" అని ఓ లేడీ ఫ్యాన్ ప్లకార్డు పట్టుకొని ఉండగా.. దాని గురించి యాంకర్ సుమ ప్రశ్నించింది. దానికి ప్రభాస్ స్పందిస్తూ.. "అది తెలియకే ఇంకా పెళ్లి చేసుకోలేదు" అంటూ నవ్వుతూ అన్నారు. "నిధి పాపని పెళ్లి చేసుకోవాలంటే ఏ వృత్తిలో ఉండాలి? ఎంత ఆస్తి ఉండాలి? ఎలా ఉండాలి?" అని మరో అభిమాని ప్రశ్నించారు. దానికి నిధి అగర్వాల్ స్పందిస్తూ.. ప్రేమించే వృత్తి ఉండాలని సమాధానమిచ్చింది.

# వరప్రసాద్ గారి న్యూ ఇయర్ కానుక..




మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి నటిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం నుంచి 'మెగా విక్టరీ మాస్ సాంగ్' ప్రోమో విడుదలైంది. ఈ పాట డిసెంబర్ 30న విడుదల కానుంది. ప్రోమోలో ఇద్దరు హీరోల స్టైలిష్ లుక్స్, స్వాగ్ ఆకట్టుకుంటున్నాయి. న్యూ ఇయర్ వేడుకలకు ఈ పాట పర్ఫెక్ట్ అని అభిమానులు భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి నటిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు'. హిట్ మెషీన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇద్దరు అగ్ర హీరోలు తొలిసారిగా కలిసి నటిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా 'మెగా విక్టరీ మాస్ సాంగ్' ప్రోమోని మేకర్స్ రిలీజ్ చేశారు.'మన శంకర వరప్రసాద్ గారు' నుంచి 'మెగా విక్టరీ మాస్ సాంగ్' ను డిసెంబర్ 30న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. సాంగ్ ఎలా ఉండబోతోందనేది హింట్ ఇస్తూ 28 సెకండ్ల చిన్న ప్రోమోని ఇవాళ వదిలారు. 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే ఈ పాటలో చిరు - వెంకీ స్టైలిష్ లుక్ లో కనిపించారు. వెంకటేశ్ కి చిరంజీవి కళ్లద్దాలు పెడితే.. చిరుకి వెంకీ గ్లాసెస్ పెడుతూ తమ మధ్య బాండింగ్ ని తెలియజేశారు. ఆర్ యూ రెడీ తప్ప ప్రోమోలో లిరిక్స్ ఏమీ వినిపించలేదు. చిరంజీవి - వెంకటేష్ కలిసి వేసే ఒక్క స్టెప్పు కూడా చూపించలేదు. వారి స్టైలిష్ లుక్స్, స్వాగ్ మాత్రమే చూపించారు. న్యూ ఇయర్ వేడుకలను సెలబ్రేట్ చేసుకోడానికి 'మెగా విక్టరీ మాస్ సాంగ్' పర్ఫెక్ట్ పాట అవుతుందని అభిమానులు భావిస్తున్నారు.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com